క్లుప్తంగా

వర్షం కోసం పూజలు


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

సంజామల: మండల పరిధిలోని ముక్కమల్లలో వెలసిన ఆంజనేయస్వామికి మంగళవారం వర్షం కోసం పూజలు నిర్వహించారు. అవుకు మండలం శిగనపల్లె గ్రామానికి చెందిన రైతులు, భక్తులు ఆంజనేయస్వామికి ఆకు పూజ చేశారు.

17న వాల్మీకి జయంతిని విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

బేతంచెర్ల: పట్టణంలో ఈ నె 17వ తేదీ జరిగే వాల్మీకి మహర్షి జయంతిని విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమవేశంలో వారు మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో వాల్మీకి జయంతిని ఘనంగా జరుపుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వాల్మీకి జయంతి జరపాలని ఆదేశాలు ఇవ్వడం శుభపరిణామం అన్నారు. సంఘం నాయకులు పుట్టపాశం వెంకటేశ్వర్లు, భూపాలు, స్వాములు, చంద్ర, మాధవకృష్ణ, చంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి


సత్యం మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ

బేతంచెర్ల: పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎద్దుల సత్యం(56) అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి మంగళవారం సత్యం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

121వ సారి రక్తదానం


రక్తదానం చేస్తున్న గోపి

డోన్ టౌన్: పట్టణానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు కోలా గోపి 121వ సారి రక్తదానం చేశారు. మంగళవారం కర్నూలులో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో గోపి ఆరుపదుల వయసులోనూ రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు.

ఆరు బస్సులకు జరిమానా



వాహన రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్టీఓ క్రాంతికుమార్

డోన్ రూరల్: మండల పరిధిలోని అమకతాడు గ్రామం టోల్‌ప్లాజా వద్ద ఆర్టీఓ క్రాంతి కుమార్ మంగళవారం వాహనాల తనిఖీ చేశారు. రాష్ట్రానికి కట్టాల్సిన రోడ్ ట్యాక్స్, ఫిట్‌నెస్, రికార్డులు సరిగ్గా లేని ఆరు ప్రైవేట్ ట్రావెల్ బస్సులకు రూ.4,54,000 జరిమానా విధించారు. అలాగే అధిక లోడ్‌తో వెళ్తున్న వివిధ వాహనాలకు రూ.1,0,1500 ఫైన్ వేశారు. ప్రయాణికుల నుంచి అధిక ధరలకు టికెట్లు విక్రయించరాదన్నారు. ఫిర్యాదు అందితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు అన్ని రికార్డులు కలిగి ఉండాలని సూచించారు. రోడ్ ట్యాక్స్ కట్టకుండా తిరిగే వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

మహిళపై దాడి ఘటనలో కేసు నమోదు

సంజామల: మహిళపై దాడి ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని ఆల్వకొండ గ్రామానికి చెందిన దూదేకుల నారిగన్న గారి ఉసేనమ్మ, వంకదారి మాబుసాహెబ్ పొలాలు పక్కపక్కనే ఉన్నాయి. వీరి మధ్య కొంత కాలంగా పొలం రస్తా విషయంలో వివాదం నెలకొంది. దీన్ని మనసులో ఉంచుకుని ఈనెల 14న ఉసేనమ్మను ఉద్దేశించి మాబుసాహెబ్ భార్య మాబ్బి పరోక్షంగా తిడుతూ ఉండింది. ఉసేనమ్మ కలుగజేసుకుని తనను ఎందుకు తిడుతున్నావని ప్రశ్నించడంతో మాబ్బి, మాబుసాహెబ్, సకిన, బాబు కర్రలతో దాడి చేసి గాయపరిచారు. తల, చేతికి గాయం కావడంతో ఉసేనమ్మను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందిన అనంతరం మంగళవారం బాధితురాలు స్టేషన్‌ను ఆశ్రయించగా నిందితులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

కూటమి నేతల బెదిరింపుల పర్వం

- మద్యం దుకాణాలు అప్పగించాలంటూ తటస్థులపై కూటమి నేతల హుకుం
- రూ.10 లక్షలు గుడ్‌విల్ తీసుకుని షాపులు ఇవ్వాలని బెదిరింపు
- ఒప్పుకోకుంటే 25 శాతం వాటా ఇవ్వాలని ఒత్తిడి
- లేనిపక్షంలో షాపు పెట్టుకునేందుకు రూములు ఇవ్వకుండా అడ్డుకుంటామని హెచ్చరిక
- చేతులెత్తేసిన ఎక్సైజ్‌శాఖ అధికారులు



కోవెలకుంట్ల: ''నూతన మద్యం పాలసీలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు ఉండవు. నిర్భయంగా దరఖాస్తు చేసుకోవచ్చు. షాపులు దక్కిన వ్యక్తులకు దగ్గరుండి మద్యం దుకాణాల ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం'' ఇది దరఖాస్తు సమయంలో ఎక్సైజ్ అధికారులు చెప్పిన మాటలు. సోమవారం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలు కేటాయించి లక్కీడిప్‌లో షాపులు దక్కిన వ్యక్తులకు లైసెన్స్‌లు జారీ చేశారు. బుధవారం నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి. అయితే లక్కీడిప్‌లో మద్యం దుకాణాలు దక్కని కూటమి నేతలు ఎలాగైనా షాపులను దక్కించుకోవాలని బెదిరింపుల పర్వానికి తెరలేపారు. బనగానపల్లె ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని బనగానపల్లె, కొలిమిగుండ్ల, అవుకు మండలాల్లో 12 మద్యం దుకాణాలు ఉండగా ఒకటి, రెండు మినహా మిగిలిన షాపులన్నీ కూటమి నేతలకే దక్కాయి. కోవెలకుంట్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 11 మద్యం దుకాణాలు ఉన్నాయి. కోవెలకుంట్ల మండలంలో ఐదు షాపులు, సంజామల మండలంలో నాలుగు, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలంలో ఒక్కోషాపును లాటరీ విధానంలో పలువురు వ్యక్తులు కైవసం చేసుకున్నారు. ఇందులో కోవెలకుంట్ల మండలంలో నాలుగు, సంజామల మండలంలో ఒక షాపు వివిధ ప్రాంతాలకు చెందిన తటస్థులకు దక్కాయి. ఆయా మండలాల్లో ఎక్కువ శాతం తటస్థులు, ఇతర పార్టీ మద్దతుదారులకు షాపులు దక్కడంతో ఆ దుకాణాలపై కూటమి నేతల కన్ను పడింది. లాటరీలో మద్యం షాపులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, తటస్థులకు దక్కడంతో జీర్ణించుకోలేని కూటమి నాయకులు అడ్డదారుల్లో షాపులు దక్కించుకునేందుకు కుట్రపూరిత మార్గాన్ని ఎంచుకోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

షాపులు అప్పగించాలంటూ బెదిరింపు

కోవెలకుంట్ల, సంజామల మండలాల్లో షాపులు దక్కించుకున్న వ్యక్తులపై కూటమి నేతలు బెదిరింపులకు దిగుతున్నారు. రూ. 10 లక్షలు గుడ్‌విల్ తీసుకుని షాపులు తమకు అప్పగించాలని లేనిపక్షంలో దుకాణంలో 25 శాతం వాటా ఇవ్వాలని హుకూం జారీ చేసినట్లు తెలిసింది. రెండింటిలో ఏదో ఒకదానికి ఒప్పుకోని పక్షంలో మద్యం దుకాణం పెట్టుకునేందుకు రూములు దొరక్కుండా అడ్డుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. బనగానపల్లె నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు బెదిరింపు చర్యలకు పాల్పడినట్లు షాపులు దక్కిన బాధిత వర్గాల ద్వారా తెలిసింది. ఎలాంటి పరిస్థితుల్లో షాపులను గుడ్‌విల్‌కు, వాటా ఇవ్వబోమని లైసెన్స్‌దారులు తేల్చి చెప్పడంతో కూటమి నేతలు సందిగ్ధంలో పడ్డారు. లాటరీలో షాపులు దక్కిన వ్యక్తులకు ఎక్సైజ్ శాఖ అధికారులు ఎలాంటి భరోసా ఇస్తారో వేచి చూడాల్సిందే.

లక్కు తేలింది

కొలిమిగుండ్ల: మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు ఆశావహులు ఎన్నో కలలు కన్నారు. లాటరీలో అదృష్టం వరించకపోతుందా అని ఆశలు పెంచుకున్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో ఈసారి కొత్త ముఖాలు సైతం మద్యం వ్యాపారంలో దిగాలని భావించి రూ.2లక్షలు చెల్లించి దరఖాస్తులు చేసుకున్నారు. బనగానపల్లె ఎక్సైజ్ పరిధిలోని కొలిమిగుండ్ల, అవుకు, బనగానపల్లె మండలాల్లో 12 మద్యం దుకాణాలు ఉన్నాయి. మొత్తం 168 దరఖాస్తులు వచ్చాయి. లాటరీలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వారు ఆనందంలో మునిగిపోగా మిగిలిన వారంతా ఖంగుతినాల్సిన పనైంది. దరఖాస్తు చేసిన రూ.2 లక్షలు గంగలో పోసిన పనైంది. దరఖాస్తుల రూపంలో ప్రభుత్వానికి రూ.3.36 కోట్ల ఆదాయం సమకూరింది. మూడు మండలాల్లో కూటమి నాయకులు మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు సిండికేట్ అయి పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసినా రింగు రివర్స్ అయింది. చాలా చోట్ల కూటమి నాయకులకు షాపులు దక్కకపోవడంతో ఖంగు తినాల్సిన పనైంది. కొలిమిగుండ్ల మండలంలోని అంకిరెడ్డిపల్లెలో మద్యం షాపునకు లాటరీలో స్థానిక నాయకులకు కాకుండా మీర్జాపురానికి చెందిన శ్రీనివాసరెడ్డికి దక్కింది. దీంతో అక్కడ మద్యం షాపు ఏర్పాటుకు స్థానిక నాయకుల నుంచి ఆటంకాలు ఏర్పడ్డాయి. చివరకు 25శాతం వాటా ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. బుధవారం నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాలు ప్రారంభం కానున్నాయి. దీంతో పల్లెల్లో మద్యం ఏరులై పారనుంది. దుకాణాల ఏర్పాటుకు గతంలో ఉన్న నిబంధనలు తొలగించి మండలం యూనిట్‌గా నిర్ణయించడంతో షాపులు ఎక్కడైనా పెట్టుకోవచ్చు. మండలానికి మూడు షాపులు కేటాయిస్తే మూడు కూడా పక్కపక్కనే పెట్టుకోవచ్చనే నిబంధనలు చెప్పకనే చెబుతున్నాయి.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

డోన్ టౌన్: పట్టణానికి తాగునీరు సరఫరా అయ్యే గాజులదిన్నె ప్రాజెక్టు పైప్ లీకేజీ కారణంగా బుధవారం నీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు నుంచి డోన్ పంప్ హౌస్‌కు వచ్చే పైప్‌లైన్‌కు ఈదుల దేవరబండ, కోటకొండ గ్రామాల మధ్య ఉన్న తిప్పనకుర్తి గ్రామ సమీపంలో లీకేజీ అయినట్లు పేర్కొన్నారు. మరమ్మతులు చేసి 17వ తేదీ నుంచి యథావిధిగా పట్టణంలో మంచినీటి సరఫరా కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ప్యాపిలి: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజయకుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్రగౌడ్ సూచించారు. అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. భోజనానికి ముందు, తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. తద్వారా నులి పురుగుల నివారణతో పాటు టైఫాయిడ్, అతిసారా, హెపటైటిస్ వంటి వ్యాధులు రాకుండా అరికట్టవచ్చని తెలిపారు.

వైద్య శిబిరం

బనగానపల్లె రూరల్: పట్టణంలోని బేతంచర్ల రోడ్డులో ఉన్న హజరత్ మహబూబ్ సుబహాని ఉర్సు సందర్భంగా దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్ అబ్దుల్ హుస్సేనిసాహెబ్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం, ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉర్సుకు వచ్చిన భక్తులకు వైద్య పరీక్షలు చేశారు. అన్నదానం చేశారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు


వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కోవెలకుంట్ల: రైతులు పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. మంగళవారం మండలంలోని గుళ్లదూర్తి, పొట్టిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా పంటల్లో యాజమాన్య పద్ధతులు, తెగుళ్లు, పురుగుల నివారణ, ఈ పంట నమోదు, భూసార పరీక్షల ఆవశ్యకత, కిసాన్ డ్రోన్ల వినియోగం, డ్రిప్, స్ప్రింకర్లు, తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు చేసిన వివిధ పంటల్లో రైతులు రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని సూచించారు. ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి కృష్ణకుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు


నివాళులర్పిస్తున్న వెలుగు ఏపీఎం, పొదుపు మహిళలు

బనగానపల్లెరూరల్: దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జీవితం యువతకు ఆదర్శం అని డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కలాం జయంతిని పురస్కరించుకుని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అబ్దుల్ కలాం సామాన్య కుటుంబంలో పుట్టి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ అత్యున్నత శిఖరాలకు చేరుకున్నారని తెలిపారు. దేశం కోసం మిస్సైల్స్ తయారు చేసి మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరు సంపాదించారని పేర్కొన్నారు. భారతరత్న, పద్మవిభూషణ్ వంటి పురస్కారాలను అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

పత్తి రైతులకు తుపాన్ బెంగ

- రాలిపోయిన పూత, పిందె
- ఆగిన క్రాసింగ్ పనులు
- ఆందోళనలో అన్నదాత


కోవెలకుంట్ల సమీపంలో తుపాన్ ప్రభావంతో సీడుపత్తిలో నిలిచిపోయిన క్రాసింగ్ పనులు

కోవెలకుంట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజుల నుంచి పత్తి రైతులను తుపాన్ బెంగ వెంటాడుతోంది. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో తుపాన్ కారణంగా మోస్తరు వర్షాలు కురుస్తుండడంతో సీడుపత్తిలో పూత, పిందె రాలిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం సబ్ డివిజన్‌లోని దొర్నిపాడు మండలంలో 11.2 మి.మీ, ఉయ్యాలవాడ మండలంలో 7.4 మి.మీ, కోవెలకుంట్ల మండలంలో 6.4 మి.మీ, సంజామలలో 4.8 మి.మీ, అవుకు మండలంలో 3.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 2,800 హెక్టార్లలో రైతులు పత్తి పంట సాగు చేశారు. ఇందులో దొర్నిపాడు, ఉయ్యాలవాడ, కోవెలకుంట్ల మండలాల్లో అత్యధికంగా సీడుపత్తి పంట సాగైంది. సీడుపత్తిలో విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు, కూలీలు, తదితర పెట్టుబడుల రూపంలో ఇప్పటికే రూ. 50 వేలు వెచ్చించారు. ప్రస్తుతం పైరు పూత, పిందె దశలో ఉండగా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో పూత, పిందె రాలిపోతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల నుంచి సీడుపత్తిలో క్రాసింగ్ పనులు నిలిచిపోగా రానున్న రెండు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలియజేయడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఇప్పటికే పూత, పిందె రాలిపోయి నష్టం వాటిల్లగా వర్షాలు కురిస్తే మరింత నష్టం చేకూరుతుందని రైతులు వాపోతున్నారు. తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు రబీ సీజన్‌లో పప్పుశనగ, జొన్న, తదితర పంటల సాగుకు అనుకూలంగా మారినా ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి, మొక్కజొన్న పంటలకు నష్టం చేకూరుస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి


ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ డీడీ

బేతంచెర్ల: ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరక్టర్ రామనాథరావు, జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని సీహెచ్‌సీని తనిఖీ చేశారు. ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్-3ను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలు, సిబ్బంది పని తీరుపై వైద్యురాలు ప్రియాంకను అడిగి తెలుసుకున్నారు. కోటపేటలో డెంగీ కేసును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ప్రజలకు సూచించారు.

సాగులో సస్యరక్షణ చర్యలు అవసరం

బేతంచెర్ల: పంటల సాగులో సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోరుమానుకొండ, కొలుములపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పంట పొలాలను సందర్శించారు. ముఖ్యంగా కంది పంట పూత దశలో ఉండడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెరికల్చర్ అధికారి ప్రసాద్, ఏఈఓలు బెన్నీ రాజు, సురేష్, అంజలి పాల్గొన్నారు.


గోరుమానుకొండలో మాట్లాడుతున్న ఏఓ

ముగ్గురు విద్యార్థినులకు గాయాలు


చికిత్స పొందుతున్న విద్యార్థిని

డోన్ టౌన్: ఆర్టీసీ బస్సు రివర్సు తీస్తుండగా ఎక్కే క్రమంలో ముగ్గురు విద్యార్థినులు గాయపడ్డారు. ఈ ఘటన డోన్ సమీపంలోని మోడల్ స్కూల్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఎప్పటిలాగే పాఠశాల నుంచి ఇంటి వెళ్లేందుకు విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. బస్సు రావడంతో సీట్ల కోసం ఒక్కసారిగా గుమిగూడారు. బస్సు రివర్సు తీసే క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడి ఇద్దరు విద్యార్థినులు తీవ్రంగా గాయపడగా.. మరో విద్యార్థినికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని డోన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇద్దరు విద్యార్థినులను మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. టీచర్ల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి


ఆర్.కొత్తపల్లెలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

బేతంచెర్ల: ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆర్.కొత్తపల్లె, ఆర్.బుక్కాపురం గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. జనవరి నాటికి ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇస్తామన్నారు. అనంతరం బేతంచెర్లలో ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. నోడల్ అధికారి బషీరున్నిసా బేగం, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, తహసీల్దార్ ప్రకాశ్ బాబు, సర్పంచ్ నాగరాజు పాల్గొన్నారు.


అప్పలాపురంలో భూమి పూజ చేస్తున్న అధికారులు

అభివృద్ధి పనులకు భూమి పూజ

బనగానపల్లె రూరల్: మండలంలోని అప్పలాపురంలో రూ.45లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీలను నిర్మించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆయా పనులకు భూమిపూజ చేశారు. పంచాయతీరాజ్‌శాఖ ఏఈ రమణ, ఏపీఓ రేష్మా, ఈసీ మక్బుల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

సంజామల: మండల పరిధిలోని నొస్సం, అక్కంపల్లె, ఆర్.లింగందిన్నె గ్రామంల్లో సీసీరోడ్ల నిర్మాణానికి ఎంపీడీఓ సాల్మాన్ మంగళవారం భూమి పూజ చేశారు. నొస్సం గ్రామానికి రూ.20 లక్షలు, అక్కంపల్లె గ్రామానికి రూ.20 లక్షలు, ఆర్.లింగందిన్నె గ్రామానికి రూ.20 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈఓఆర్డీ రాధికా రెడ్డి, ఏఓ విజయకుమార్ రెడ్డి, ఏపీఓ ప్రకాష్ రావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ పండుగ

డోన్ టౌన్: గ్యారీ పండుగను పురస్కరించుకుని కొండపేటలో వెలసిన దస్తగిరిస్వామి దర్గా పీఠాధిపతి అక్బర్‌స్వామి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో జెండాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఫకీర్ల డప్పు వాయిద్యాలతో జెండాలను ఊరేగింపుగా తీసుకెళ్లి దర్గాలో ఉంచారు. మత పెద్దలు మహబూబ్‌సుభాని, అయ్యకొండ పీఠాధిపతులు బషీర్ అహమ్మద్ పాల్గొన్నారు.


పట్టణంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న ముస్లింలు


సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ప్రధాన రహదారి


కార్యాలయం ముంగిటే నిలిచి ఉన్న మురుగునీరు

కార్యాలయం.. మురుగునీటి మయం

ప్యాపిలి: రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.5 కోట్ల ఆదాయం సమకూర్చే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మురుగు నీటికి నిలయంగా మారింది. స్థానిక ప్రధాన రహదారి నుంచి కార్యాలయానికి వచ్చే రహదారి బురదమయంగా మారడంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు సర్కస్ ఫీట్లు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రిజిస్ట్రేషన్లతో పాటు ఇతర పనుల కోసం రోజూ అధిక సంఖ్యలో ప్రజలు ఈ కార్యాలయానికి వచ్చి వెళ్తుంటారు. కార్యాలయానికి సమీపంలోని ఊరికుంట ఉండడంతో ఈ ప్రాంతం పందులకు అడ్డాగా మారింది. కార్యాలయానికి వచ్చిన ప్రజలు తమ పని పూర్తయ్యే వరకు గంటలకొద్ది ఇక్కడే వేచి ఉండాల్సి ఉంటుంది. అయితే కార్యాలయ పరిసరాలు మురుగునీరు, పందులు, దోమలు, ఈగలతో నిండి ఉన్నాయి. దీంతో కార్యాలయంలో పని ముగించుకుని వెళ్లే వారు బోనస్‌గా వ్యాధులను అంటించుకుని వెళ్తున్నారు. కార్యాలయానికి కనీసం ప్రహరీ గోడ, గేటు కూడా లేకపోవడంతో పందుల సంచారం ఎక్కువగా ఉంటోంది. దీంతో ఈ కార్యాలయంలో పని చేసే సిబ్బంది కూడా ఎక్కువ కాలం ఇక్కడ విధులు నిర్వర్తించలేని పరిస్థితి నెలకొంది. బ్రిటీష్ కాలంలో నిర్మించిన కార్యాలయానికి అధికారులు మరమ్మతులు చేపట్టి పటిష్టపరుచుకున్నారు. అయితే కార్యాలయ పరిసరాలు మాత్రం ప్రజలు కనీసం కొద్దిసేపు కూడా వేచి ఉండలేని విధంగా ఉన్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్యాలయానికి వచ్చే రహదారికి సీసీ రోడ్డు మంజూరు చేయడంతో పాటు కార్యాలయానికి ప్రహరీ నిర్మించి గేటు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే కార్యాలయం ఆవరణలోకి పందులు రాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

వైభవం.. వాసవీమాత తెప్పోత్సవం


వాసవీ మాత తెప్పోత్సవం


నృత్యం చేస్తున్న కళాకారులు

బేతంచెర్ల: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని అమ్మవారిశాలలో చివరి రోజు మంగళవారం వాసవీమాతకు తెప్పోత్స కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. ఆర్యవైశ్యులు, వాసవీ మహిళా మండలి సభ్యులు అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. తెప్పోత్సవం సందర్భంగా వాసవీ మహిళా మండలి మహిళలు కోలాటాలు, నవదుర్గా దేవతల అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాంస్కృతి కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఆర్యవైశ్యులు గుండా గోపాలు, కందగడ్డల మోహన్‌రావు, గురవయ్య, శేష మోహన్, రాజేంద్ర, జనార్దన్, విష్ణు, బళ్లాని సూర్య పాల్గొన్నారు.